# బంధం

"నాన్నగారికి సీరియస్‌గా ఉంది. మీ కోసం ఎదురుచూస్తూంటాం. వెంటనే బయలుదేరి రండి - ప్రభాకర్."

టెలిగ్రామ్ చూడగానే పార్వతికి దఃఖం ఎగదన్నుకొని వచ్చింది. చాలాసేపు ఏడ్చాక కానీ కర్తవ్యం గుర్తుకు రాలేదు.

తను వెళ్ళాలి. ఆయన్ని చూడాలి.

ఆమె గదిలో నుంచి బయటికి వచ్చేసరికి పిల్లలు నిలబడి ఉన్నారు. వాళ్ళంతా ఆమె పైన ఆధారపడి ఉన్న అనాథ బాలబాలికలు.

"నేను అర్జంటుగా ఊరికెళ్తున్నా. గొడవలు లేకుండా మీరు ఎప్పటిలా ఉండాలి. నేను అన్ని ఏర్పాట్లు చేసిపోతాను."

వాళ్ళు మౌనంగా తలలూపారు.

✡ ✡ ✡

"టికెట్ !"

అంతవరకు విండోలో నుంచి ఎటో చూస్తున్న ఆమె ఉలిక్కిపడింది.

టికెట్ తీసుకుని మళ్ళీ విండోవైపు తల తిప్పబోతుంటే ఆమె ప్రతిబింబం అద్దంలో తళుక్కుమంది.

పక్క ప్రయాణికుడు ఎవరో పగిలిన పెద్ద అద్దాన్ని రిపేరుకి తీసుకువెడుతున్నట్లుంది.

ఆమె అద్దాన్నే చూస్తూ ఉంది. అద్దంలో ప్రతిబింబం బస్సు కుదుపుకు అటూ ఇటూ ఊగుతోంది. అప్పుడప్పుడు అద్దం పగుళ్ళలో పడి ఒక ప్రతిబింబం వెయ్యి ప్రతిబింబాలుగా చీలుతోంది.

అద్దంలోని ఆ ప్రతిబింబం వెనుక ఏవేవో దృశ్యాలు

ఆమె మనస్సు వెనక్కిపోతోంది. బస్సు ముందుకు పోతోంది.

✡ ✡ ✡

పదహారేళ్ళ పార్వతి పెళ్ళికూతురు అలంకరణలో మెరిసిపోతోంది. పెళ్ళి మేళాలు, మంత్రాల మధ్య కూడా ఆమెకు నిద్ర ముంచుకువస్తోంది.

"పార్వతీ ! నిద్రపోకు! నా తల్లివి కదూ."

పెళ్ళికొడుకు శివరామ్ నవ్వుకుని పార్వతి వైపు చూశాడు.

ఎంత అందంగా ఉంది పార్వతి ! కానీ తను పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించకపోతే ఆ అందం ఏమై ఉండేది? ఎవడో బీదవాడి పాలయ్యేది. తనలాంటి ధనవంతుడు, గొప్ప వంశంవాడు, అందగాడు ఆమెకు భర్తగా లభించేవాడా?

శివరాం వస్తుతః మంచివాడే. ఇతరులకు సహాయం చేద్దామన్న కోరిక ఉన్నవాడు. పార్వతిని అంగీకరించడానికి ఒక కారణం-ఆమె పేదరికం.

కానీ అతనికి తను గొప్పవాడి నన్న అతిశయం జాస్తి. ఇతరులకు తను చేసే మేలును అంతా గుర్తించి కీర్తించాలన్న తత్వం కలవాడు. ఈ విషయాల్లో అతనికి పట్టుదల హెచ్చు.

"పెళ్ళికూతురు కుందనపు బొమ్మలాగుంది. అదృష్టం ఆ అమ్మాయిది కాదు. ఆ అమ్మాయిని భార్యగా పొందుతున్న శివరాంది."

ఎవరో అనుకోవటం శివరాం చెవిలో పడింది. గుండెలమీద గునపంతో పొడిచినట్లయింది.

పెళ్ళిపీటలమీద కూర్చున్న దగ్గరి నుంచి ఇంతే! అంతా పార్వతి సౌందర్యాన్ని పొగుడుతున్నారు. తన ఔదార్యాన్ని త్యాగాన్ని ఎవరూ కీర్తించటం లేదు.

"పార్వతీ! మనిద్దరిలో ఎవరి అందం గొప్పది? ఎవరు గొప్పవాళ్ళం?" మర్నాడు పార్వతి దగ్గరి కెళ్ళి సూటిగా అడిగేడు.

పార్వతి కంగారుపడింది. భయపడింది.

"బాబూ!పార్వతి చిన్నపిల్ల..."

"ఇది భార్యాభర్తల మధ్య వ్యవహారం. మీరెవ్వరూ కలుగచేసుకోవద్దు. పార్వతే సమాధానం చెప్పాలి."

"అందమంటే ఏమిటసలు? నాకు తెలియదు."

"ఓ! అలాగా!" అతను వెళ్లిపోయాడు.

ఆతరువాత అత్తగారింటి ఛాయలకి రాలేదు. పార్వతికి పద్దెనిమిదేళ్ళు వచ్చాయి. కాపురానికి పంపే ఈడు. కానీ శివరామ్ మాట్టాడితేనా? అంతా పోరగా పోరగా ఆఖరికి కాస్త దిగి వచ్చాడు

"నా భార్య నేను పెట్టే పరీక్షలో నెగ్గాలి. లేకపోతే ఆమెతో కాపురం చేయను." అంటూ అత్తవారింటికెళ్ళాడు.

"పార్వతితో నేను ఒంటరిగా మాట్లాడాలి. ఇప్పుడు ఈ క్షణంలో."

పార్వతి గదిలోకి పంపేరతన్ని.

ఆమెను చూడగానే అతని కళ్ళు చెదిరిపోయాయి. ప్రేమ పురివిప్పుకుంది. కోరిక పెల్లుబికింది. కానీ అంతలోనే తన వంశం గొప్పతనం, తన గొప్పతనం గుర్తుకొచ్చాయి. అతిశయం వెన్ను తట్టింది. అహంకారం నెత్తినెక్కి కూర్చుంది.

"నేనెవరో తెల్సా"

"నా మెడలో తాళికట్టిన భర్త"

"నన్ను ప్రేమిస్తున్నావా?"

"ఊ"

"ఎందుకు ప్రేమిస్తున్నావ్?"

"మీరు నా భర్త కదా?"

"అంతేనా? పెళ్ళినాడు ఒక ప్రశ్న అడిగాను. అప్పుడుచిన్నపిల్ల వన్నారు. ఇప్పుడు పెద్దదాని వయ్యావుగా? మళ్ళీ అదే ప్రశ్న వేస్తాను. సూటిగా సమాధానం చెప్పాలి. మనిద్దరిలో ఎవరి అందం గొప్పది? ఎవరు గొప్పవాళ్ళు?"

ఆమె వెంటనే జవాబివ్వలేదు. అసలామె తనను చూసిందో లేదో అన్న అనుమానం వచ్చిందతనికి.

"వెంటనే జవాబివ్వాలి. కావాలంటే తలెత్తి నన్ను చూడవచ్చు."

"అక్కర్లేదు. అందాన్ని గురించి నేను ఆలోచించను. నేను ప్రేమించేది వివాహబంధాన్ని. నా భర్త ఎలా ఉన్నా నాకు అందగాడుగానే కనిపిస్తాడు."

"అంటే అందగత్తె నన్న గర్వం నీ మనసులో ఉందన్నమాట! తాళి కట్టేను కనుక నేను అందగాడిగా కనిపిస్తున్నానన్నమాట! నేను కాక మరో కురూపి తాళికట్టినా అంతే కదా? నన్నూ నా వంశాన్ని, నా గొప్పతనాన్ని గుర్తించి, గౌరవించి, పొగిడే భార్య నాకు కావాలి. నీకు నా భార్యగా ఉండే అర్హత లేదు. నువ్వు గౌరవించే వివాహబంధం ఈ క్షణంలో అంతమైనట్లే.'

అతను ఆవేశంగా అని గిరుక్కున తిరిగి తలుపు దగ్గరికెళ్ళాడు.

అప్పుడామె బిత్తరపోయి తలెత్తి అతన్ని చూచింది.

"ఏమండీ"

అతనాగి ఆమెను చూశాడు. ఇద్దరి కళ్ళూ క్షణం కలుసుకున్నాయి

"మీ కన్నా అందమైనదాన్నని నేనన్నానా?

"ఇప్పుడా చర్చ అనవసరం. నా నిర్ణయాన్ని ప్రకటించాను. ఇక దానికితిరుగులేదు. కావాలంటే మనోవర్తి కోరుకో. పారేస్తాను. అంతేకాని ఎన్ని కోర్టులు తిరిగినా నిన్ను భార్యగా ఏలుకోవటం మాత్రం కల్ల!"

అతను బయటకి అడుగు వేయబోయాడు.

"ఒక్క మాట! మీరు కాదన్నా జీవితాంతం నేను మీ భార్యగానే ఉంటాను".

✡ ✡ ✡

పార్వతి రిక్షా దిగింది.

ఒకప్పుడు దేదీవ్యమానంగా వెలిగిపోయిన ఆ భవంతి ఇప్పుడు భర్తృవిహీనలా ఉంది. సిరిసంపదలతో పాటు ఇంటి నౌకర్లు కూడా పోయారు.

సింహద్వారం దాటి లోపలికి అడుగు పెడ్తుంటే ఆమె కాళ్ళు వణికాయి. ఏం వార్త వినాల్సివస్తుందో, ఎలాంటి దృశ్యాన్ని చూడాల్సివస్తుందో!

ఆమె కుడికాలు లోపలికి పెట్టింది. తను మొదటిసారి ఈ ఇంట్లోకి కాలు పెట్టిన దృశ్యం ఆమె కళ్ళ ముందు నిలిచింది.

పార్వతి కప్పుడు పాతికేళ్ళు నిండేయి. ఆమె అందం అందరికీ నేత్రపర్వమే!

"పార్వతి అందం అడవిగాచిన వెన్నెలయింది పాపం."

అంతా జాలిపడే వారే! కొందరు ఎంగిలిచేయ ప్రయత్నించారు. మరి కొందరు పెళ్ళి చేసుకోవడానికి ముందు కొచ్చారు.

ఎవరి ఔదార్యాన్ని జాలి, సానుభూతిల్నీ ఆమె అంగీకరించలేదు.

బ్రతకాలి. బ్రతుక్కి సార్థకతను సాధించాలి. పెళ్ళి చేసుకొని సంసారం చేసి పిల్లల్ని కనటం అందుకో మార్గం కావచ్చు. కానీ కోరికల్ని కాస్త నిగ్రహించుకోగలిగితే జీవిత సార్థకతకు ఇంకా అనేక మార్గాలున్నాయిగా ?

ఆ మార్గాలలో తనకు అనుకూలమైన దాన్ని ఆమె అన్వేషించుకొంటోందప్పుడు. బంధువర్గం ఆమెకు ఆసరాగా నిలబడ్డాడు.

అప్పట్లో ఓ రోజు ఆమె పేర ఓ ఉత్తరం వచ్చింది.

"మా యజమాని శివరామయ్యగారు టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నారు. కనుక తెలపటమైనది."

శివరాం గుమాస్తా రాసేడా ఉత్తరాన్ని, శివరాం రాయించాడా?

పార్వతిని పంపడమా? పంపకపోవటమా? పెద్దలు ఆలోచనలో పడ్డారు.

కాపురానికే వెళ్ళని పిల్ల. పైగా శివరాం తల్లిదండ్రులు కూడా చనిపోయారు. అతనెవరో బాలవితంతువును చేరదీసేడు. ఎలా పంపటం?

"నేను వెళ్ళటానికే నిర్ణయించుకున్నాను. మీ రెవరూ రావద్దు."

సింహద్వారం దగ్గర సేవకుడు ఆమెకు ఆహ్వానం పలికాడు. సేవకుడి వెంట నడుస్తుంటే కాళ్ళు వణికేయి. గుమ్మం దాటేటప్పుడు కుడికాలు ముందు పెట్టింది.

"మీరు వస్తారనే అనుకున్నాం అమ్మగారూ. చిన్నమ్మగారిని పిలుస్తాను. కొంచం ఆగండి." చావడిలో గుమస్తా ఎదురొచ్చి అన్నాడు.

చిన్నమ్మగారంటే శివరాం ఉంచుకున్న ఆమేనా?

"వచ్చావామ్మా చెల్లీ! రారా, నిన్ను చూడగానే నా నెత్తిన బరువు సగం దించినట్టయింది.' ఆమె పార్వతిని చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకెళ్తూ ప్రేమగా అంది.

"జ్వరం చాలా రోజులుగా ఉందమ్మా. కానీ మొండిమనిషి కదా! డాక్టర్ మీద కోపం వచ్చి మందు తీసుకోలేదు. జ్వరం తిరగబెట్టింది. టైఫాయిడ్‌లోకి దించింది. ఇప్పుడు మంచి వైద్యమే జరుగుతున్నదనుకో. ఇక నువ్వు కూడా వచ్చావుగా! జ్వరం తగ్గిపోతుందిలే."

పార్వతిని శివరాం గదిలోకి తీసుకెళ్ళింది సుశీల.

చిక్కిపోయి, గడ్డం పెరిగి వికృతంగా ఉన్నాడుశివరాం. అందం ఎంత అశాశ్వతమైనది.

"పార్వతి వచ్చిందండీ." అలా నాలుగుసార్లు చెప్పగా శివరాం "ఊ" అన్నాడు.

అతను కళ్ళు తెరిచి చూసేసరికి ఆమెకు సిగ్గు ముంచుకొచ్చినట్లయింది. తల వంచుకుంది.

అతను పలకరించాలని ఆమె ఆశించలేదు. అతను పలకరించనూ లేదు. కానీ అతని జ్వరం తగ్గిందాకా ఆమె అక్కడే ఉంది.

"పార్వతి వెళ్తానంటోందండీ".

"ఊ"

వెళ్ళడానికి పార్వతి నాలుగడుగులు వేసింది.

"రాదల్చుకున్నప్పుడు రావచ్చు. ఏమన్నా కావాలంటే సుశీల నడిగి తీసుకోవచ్చు.'

పార్వతి వింది. కానీ ఆ వరాలే పదివేలనుకొని పొంగిపోలేదు.

✡ ✡ ✡

"పెద్దమ్మా వచ్చావా? అమ్మా, పెద్దమ్మ వచ్చింది" ప్రభాకర్ పెద్దగా అరిచాడు. అతని గొంతులో ఏదో వెర్రి సంతోషం!

"ఆయన కెలా ఉంది ప్రభాకర్?"

"కోమాలో ఉన్నారు పెద్దమ్మా!"

"రోజులు-గంటలు-నువ్వు సమయానికి వస్తావో రావోనని భయపడ్డాం. వచ్చావు. అంతేచాలు."

పార్వతి శివరామయ్య గదిలోకి వెళ్ళి మంచంమీద ఆయన పక్కనే కూర్చుంది.

ఆయనలో ప్రాణం ఉంది. అయినా లేనట్లే. ప్రేమాభిమానాలకు ద్వేషాహంకారాలకూ అతీతు డిప్పుడాయన.

హఠాత్తుగా ఆయననొక్కసారి స్పృశించాలన్న కోరిక కలిగిందామెకు. ఆయన చేతిని తన చేతిలోకి తీసుకుంది.

ఎన్నడో పెళ్ళినాడు స్పృశించిన చెయ్యి. ఆ చెయ్యి తన చేతిని పట్టుకుని ఆనాడు అగ్నిహోత్రం చేయించింది.

తన చేతిని పట్టుకుని 'ధర్మేచ అర్థేచ కామేచ నాతిచరామి' అంటూ ప్రమాణం చేశాడు. కానీ ప్రమాణాన్ని తప్పి మళ్ళీ పెళ్ళి చేసుకుని పిల్లల్ని కన్నాడు. తన కళ్ళ ఎదుటే ఇవన్నీ జరిగాయి. తనకా సుఖాలు లేవన్న బాధలేదు. కానీ తను తప్పు చేసేనని చేస్తున్నాని, ఆయన ఎప్పుడన్నా పశ్చాత్తాపం చెందాడా?

ఆమెకు ఏవేవో దృశ్యాలు గుర్తుకు రాసాగాయి.

సుశీలను శివరామ్ పెళ్ళి చేసుకొన్నట్లు అందరికీ తెలిసింది. దర్జాలకు పోయి బడ్డు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు.

పార్వతి అప్పటికే తన లక్ష్యాన్ని నిర్ణయించుకొంది. అందు కనుగుణంగా తన

జీవితాన్ని మలుచుకొంది. పదిమంది చేత నిస్వార్థ సంఘసేవ చేసే పవిత్రురాలు అనిపించుకొంది.

ఆమె శివరాంతో బంధాన్ని పెంచుకోవాలనుకోలేదు. అంత వ్యవధి కూడా ఆమెకు లేదు.

"అక్కయ్యా కొడుకు పుట్టేడు. చూడడానికి రావూ?" అని సుశీల రాస్తే వెళ్ళింది. కొడుక్కి 'ప్రభాకర్' అన్న పేరు ఆమే సూచించింది.

"ఉత్తరం రాస్తే కాని రాకూడదా? ఎప్పుడైనా రావచ్చునని చెప్పానుగా?" వెళ్ళబోతుంటే శివరాం అన్నాడు. అందులో రమ్మన్న అభ్యర్థనతో పాటు అహంకారం కూడా ఉంది.

"నీ పనుల మీద ఎలాగూ ఈ ఊరికి వస్తుంటావుట కదా? ఇంటికి రావచ్చు."

తీరికున్నప్పుడు వెళ్ళేది. వెళ్ళినప్పుడల్లా ఆ ఇంట్లో ఏదో మార్పు. సంపద శీఘ్రంగా క్షీణిస్తోంది. పిల్లల సంఖ్య పెరుగుతోంది. సుశీలకు దిగులు పట్టుకొంది,

"మీ వయసు పెరుగుతోంది. రేపటి సంగతి ఆలోచించకపోతే పిల్లలేమయిపోతారు? ముందుచూపు అక్కర్లేదూ?" ఆఖరికి ఓ రోజు అంది.

"దూరం నుంచి సలహాలివ్వకపోతే దగ్గరుండి పెత్తనం చెయ్యరాదూ. పుట్టుకతో వచ్చిన నా అలవాట్లను, నా తత్వాన్ని మార్చే శక్తి సుశీలకు లేదని తెలియదూ? నేను నడవమన్నట్లు నడుస్తుంది కానీ సుశీలకు నన్ను నడిపించగల శక్తి లేదు."

తనక్కడే ఉండాలని శివరామయ్య భావం. కానీ అది తనకు సాధ్యం కాదు. తనని నమ్ముకొన్న అనాథలేంకావాలి? పైగా ఈ ఇంట్లో తన స్థానం ఏమిటి?

తన కాయన భర్త కానీ ఆయనకు తను భార్య కాదు. పిల్లలకు తను 'పెద్దమ్మ' కాని 'అమ్మ' కాదు. కాలేదు.

"వయసు మమ్మల్ని జయించింది పార్వతీ. నువ్వు మాత్రం వయసును జయిస్తున్నట్టున్నావ్?" మరోసారి వచ్చినప్పుడు అన్నాడు.

ఆ తరువాత క్రమంగా పార్వతితో చనువుగా మాట్లాడసాగాడు. సలహాలడిగేవాడు. కానీ "పార్వతీ, అతిశయాలకీ, అహంకారానికీ బానిసనై నీ జీవితాన్ని నాశనం చేశాను. అందం, సిరిసంపదలు అశాశ్వతం. ప్రేమ శాశ్వతం. వివాహబంధం అంతకన్నా శాశ్వతం. గొప్పతనం పుట్టుకతో రాదు పార్వతీ? సంపాదించుకుంటే వస్తుంది. నేను నిన్ను ఇప్పటికీ ప్రేమిస్తున్నాను. నేను కాదనుకన్నా నువ్వు నా భార్యవే". అని ఒక్క మాట ఎన్నడూ అనలేదు.

మరోరోజు గడిచింది. శివరామయ్య కోమాలోనే ఉన్నాడు.

"అక్కయ్యా! లేచి స్నానం చేసి నాలుగు మెతుకులు తినమ్మా!"

సుశీల ఎన్నిసార్లు అన్నా లాభం లేకపోయింది.

ఆయన్ని చూస్తూ ఆయన పక్కనే అలాగే కూర్చుంది పార్వతి. అన్నం, నీరు, నిద్ర ఏమీలేవు.

మానసికంగా ఆమె షాక్ తిన్నదని ఊహించాడు ప్రభాకర్ మనసుకు ధైర్యాన్ని ఉల్లాసాన్ని కలిగించే మార్గాలు అన్వేషించాడు.

"పెద్దమ్మా నీకు ఎవరూ లేరని దిగులా? మా నాన్నను మానసికంగా భర్తగా భావించావు. మరి ఆయన బిడ్డలమైన మేము నీ బిడ్డలం కాదూ? వాసు తమ్ముడు పుట్టగానే వాడిని నీకు నాన్న దత్తత చేసేశాడు."

అలా ఎంత చెప్పినా రెస్పాన్స్ లేకపోవటంతో ప్రభాకర్‌కి భయం వేసింది. డాక్టర్‌కు కబురు చేశాడు.

"అన్నయ్యా! ఈ కవరు నాన్నగారి పుస్తకంలో దొరికింది. పెద్దమ్మ పేరిట నాన్న ఏదో ఉత్తరం రాసేరు."

వాసు అనటంతో ఆమెలో చలనం వచ్చింది.

"ఉత్తరమా? ఆయన నాకు రాశారా? ఏదీ?" సుషుప్తావస్థలో నుంచి జాగ్రదావస్థలోకి వచ్చిన దానిలా అంది పార్వతి.

ప్రభాకర్ అందించిన ఉత్తరాన్నిచదివింది.

"పార్వతీ!

నేను నిన్ను పెళ్ళికి ముందే ప్రేమించాను. పెళ్ళి చేసుకున్నాక కూడా ప్రేమించాను. ఇప్పటికిదాకా ప్రేమిస్తూనే ఉన్నాను. నీ కన్నా నేను అందగాడిననీ, గొప్పవాడిననీ నువ్వు ఒక్క మాట అని ఉంటే నిన్ను నా శిరసున ఉంచుకొని పూజించే వాడినేమో! కానీ అంత చిన్నతనంలో నువ్వు అందానికి కొత్త నిర్వచనాన్ని చెప్పేవు. ప్రేమించుకున్నాక, పెళ్ళి చేసుకున్నాక, భర్తకు భార్య, భార్యకు భర్త అందంగానే కనిపించాలి. కనిపిస్తారు. లేకపోతే వారి ప్రేమలోనే లోపం ఉందన్నమాట! ఈ లోతైన భావాన్ని అహంకారంచేత నేను గ్రహించలేకపోయాను. గ్రహించాక చేయగలిగిందేమీ లేకపోయింది. నీకు ఎలాగూ ద్రోహం చేశాను. సుశీల క్కూడా ద్రోహం చేసి పాపం మూట కట్టుకోనా?

"పార్వతీ!

"బ్రతికుండి నీకు నేనేమీ ఇవ్వలేకపోయాను. కానీ చచ్చి నీకు వైధవ్యాన్ని మాత్రం ఇస్తానేమోనని బాధగా ఉంది."

"నీ ప్రేమతో, ఆదర్శంతో నన్ను జయించావు పార్వతీ! వివాహబంధాన్ని నువ్వు అంతగా గౌరవించటం నా పూర్వజన్మసుకృతం. నేను నీ పట్ల చేసిన అపచారాన్ని క్షమించమని

ఎలా అడగను? నీ సంస్కారానికి నా అహంకారం శిరసు వంచి నమస్కరిస్తోంది."

ఆమె కళ్ళలో నీళ్ళు నిండలేదు. గుండెలో ఏదో తృప్తి.

భర్తవైపు ప్రేమగా చూసింది. శివరామయ్య అప్పుడే కళ్ళు తెరిచి పార్వతిని చూశాడు.

అయన ఆమె చేతుల్ని గట్టిగా తన చేతుల్లో బిగించి ఆమెను తన గుండెమీదికి లాక్కొన్నాడు.

ఇంతలో ఆయన కళ్ళు మూతలు పడ్డాయి. తలపక్కకి వాలింది.

"పెద్దమ్మా. నాన్నగారు... నాన్నగారు.. చనిపోయారు!"

పార్వతిని ఆయన గుండెలపై నుంచి లేవదీయబోయాడు ప్రభాకర్. అంతలోనే అది తనకు శక్యం కాదని గ్రహించాడు.

ఆమెను ఆయన గుండెలపైనే ఉంచి చేతులు జోడించి నమస్కరించాడు

ఆంధ్రప్రభ వారపత్రిక 29.7.87